క్లుప్తంగా

చిన్నారులను ఆదుకోవాలి



నవీపేట: తల్లిదండ్రుల ఆత్మహత్యలతో అనాథలుగా మారిన పోతంగల్ గ్రామానికి చెందిన చిన్నారులు నాగలక్ష్మి, సహస్ర, విష్ణుప్రియలను ఆదుకోవాలని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్ కోరారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి ఆయన మాట్లాడారు. నవీన్ అప్పుల బాధతో మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. నవీన్ భార్య లలిత మూడేళ్ల కిందట అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. చిన్నారులను ఎమ్మెల్సీ కవిత ఆదుకోవాలని కోరారు.

పట్టణ అభివృద్ధికి కృషి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని నూతన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ అన్నారు. సచివాలయంలో పంచాయతీరాజ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ చౌహాన్ ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు మున్సిపల్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో యువజన సంఘాల సభ్యులు బుధవారం వీడీసీ అధ్యక్షుడు విజయ్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే స్థలం కేటాయించి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి నరేశ్, ఉదయ్, నవీన్, శ్రీకాంత్, ప్రశాంత్, అజ్జు, నాని పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

బాల్కొండ: మండల పరిధిలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం బాల్కొండ బీఆర్ఎస్ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంజూరుకు కృషిచేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు లింగాగౌడ్, దాసరి వెంకటేశ్ , విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.
గమనిక: స్థానిక సర్పంచ్ సాక్షి సంవత్సర చందాదారు ఫోటో వాడగలరు

'కంటి వెలుగు' ప్రారంభం

రెంజల్(బోధన్): వీరన్నగుట్ట తండాలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ జాదవ్ గణేశ్ నాయక్ ప్రారంభించారు. అర్హులైన ప్రతీ ఒక్కరు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటి జబ్బులను దూరం చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారులు రవీందర్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో 20 ఏళ్లుగా కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగించిన భూమయ్య(80) అనే అనాథ వృద్ధుడు బుధవారం మరణించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. నిత్యం కూరగాయల మార్కెట్‌లో గడిపే భూమయ్య నాలుగైదు రోజులుగా అనారోగ్యంతో బాధడుతున్నాడని, ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం మధ్యాహ్నం మరణించాడని స్థానికులు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో ఒడ్డెర కాలనీ చెరువు కట్ట అభివద్ధి పనులను బుధవారం చేపట్టారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాగా చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి నీటి పారుదల శాఖ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో చెరువు కట్ట ఎత్తు, వైశాల్యం పెంచుతూ అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ తెలిపారు. చెరువు కట్టపై నుంచి భీమన్న గుడి, లక్ష్మీ నరసింహ స్వామి గుడి, రేణుక ఎల్లమ్మ ఆలయాలకు వెళ్లే భక్తులకు సౌకర్యంగా మారడంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

ఆర్మూర్: సీఎం కేసీఆర్ బాన్సువాడ పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నాయకులు, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక చర్య అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆర్మూర్ సబ్ డివిజన్ నాయకుడు దేవరాం విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కిషన్, పీడీఎస్‌యూ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తానే ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కార్యకర్తగా ఉంటానన్న కేసీఆర్ ఇప్పుడు తన హామీలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పీవైఎల్ ఆర్మూర్ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అఫ్జల్, పీడీఎస్‌యూ ఏరియా ఉపాధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. వంతెన మరిచారు

- గుత్పలో ఆరేళ్లుగా ప్రయాణికులకు తప్పని నరకయాతన
- గతంలో వేసిన రోడ్డు కూడా ధ్వంసం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



దెబ్బతిన్న గుత్ప నుంచి కల్లెడికి వెళ్లే రహదారి



వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

మాక్లూర్: మండలంలోని గుత్ప నుంచి కల్లెడికి వెళ్లే రహదారి మధ్యలో ఉన్న పెద్ద కాల్వ(ఒర్రె)పై వంతెన నిర్మించకుండానే బీటీ రోడ్డు వేసి వదిలేశారు. బీటీ రోడ్డు పూర్తయి 6 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు వంతెన నిర్మాణం చేపట్టలేదు. ఆ రహదారి ద్వారా వెళ్లే వాహనదారులు కాల్వలో చిక్కుకొని నరకయాతన పడుతున్నారు. ఈ సందర్భంగా కొందరు ప్రయాణికులు వంతెన నిర్మించకుండా బీటీ రోడ్డు ఎవరు వేయమన్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. గుత్ప నుంచి ఈ రోడ్డు ద్వారా కల్లెడికి చేరుకుంటే అక్కడి నుండి చిన్నాపూర్, డీకంపల్లి, మాక్లూర్, నందిపేట, జన్నేపల్లి, నవీపేట తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే సులభమవుతుంది. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు 2014– 2015 లో 2. 814 కిలోమీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి గ్రామీణ రహదారుల నిర్మాణ పథకం ద్వారా సీఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.1.97 కోట్లు మంజూరు చేసి ఆ బీటీ రోడ్డు పనులు కూడా పూర్తి చేశారు. కానీ మధ్యలో నిర్మించాల్సిన చోట వంతెన నిర్మించకుండానే వదిలేశారు. ఫలితంగా ప్రయాణికులు అష్టకష్టాలు పడి కాల్వను దాటుకుంటూ ప్రయాణం సాగిస్తున్నారు. రూ కోటి 97 లక్షలు వెచ్చించి బీటీ రోడ్డు నిర్మించిన ఫలితం లేని పని ఇది అంటూ పలువురు విమర్శిస్తున్నారు. వేసిన బీటీ రోడ్డు సైతం నామ రూపాలు లేకుండా పోయింది. ఇప్పటికైన స్పందించి ఈ రహదారిపై వంతెన నిర్మించి పూర్తి స్థాయిలో అందుబాటులోనికి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరగా నిర్మించాలి



గుత్ప, కల్లెడి మధ్యలో వేసిన బీటీ రోడ్డు పూర్తయి 6 సంవత్సరాలవుతుంది. ఒర్రెపై వంతెన నిర్మించ లేదు. ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు అష్టకష్టాలు పడుతూ ఒర్రెను దాటుకుని ప్రయాణం సాగిస్తున్నారు. వర్షాకాలం మొత్తానికే ఈ రహదారి ద్వారా వెళ్లటం కుదురదు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే వంతెన నిర్మించాలి.

–శ్రీనివాస్, గుత్ప, డీసీసీ మండల అధ్యక్షుడు

అమరుల ఆశయాలు సాధిస్తాం

- ఎమ్మార్పీఎస్ నేత విద్యాసాగర్



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోధన్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన అమరుల ఆశయాలు సాధిస్తామని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. వర్గీకరణతోనే మాదిగ, ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని అరుంధతి సంఘ భవనంలో వర్గీకరణ ఉద్యమంలో అసువుల బాసిన అమరులు పొన్నాల సురేందర్ మాదిగ, దామోదర్, మహేష్, ప్రభాకర్, యాదయ్య, భారతిల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరావు, పట్టణ, ఆయా మండలాల ప్రతినిధులు గుంజరి నాగయ్య, పెద్దింటి సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు శ్రీ చైతన్య విద్యార్థి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి అక్షింతల స్లోకేశ్ జాతీయ స్థా యి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపా ల్ ముత్తు బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లో గత నెల 25న సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో స్లోకేశ్ అద్భుత ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. రాజస్థాన్‌లో ఈ నెల 28 నుంచి 31వ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో స్లోకేశ్ పాల్గొననున్నట్లు తెలిపారు. స్లోకేశ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్ సంతోషం వ్యక్తం చేశారు.

షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ముందస్తు అరెస్ట్



బోధన్ పోలీస్‌స్టేషన్‌లో షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు

బోధన్‌టౌన్(బోధన్): సీఎం కేసీఆర్ బాన్సువాడ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ ఆలయానికి వస్తున్న నేపథ్యంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మిక నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడారు. బకాయి వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇతర ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ దృష్టికి కార్మికుల వేతనాల గురించి తీసుకెళ్లగా సీఎం కేసీఆర్‌తో పాటు, కేటీఆర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రతి ఇంటికి మరుగు దొడ్డి నిర్మించుకోవాలి

బాల్కొండ: ప్రతి ఇంటికి మరుగు దొడ్డి నిర్మించుకోవాలని మెండోరా ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం కోడిచర్లలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్‌లో భాగంగా ప్రయోగాత్మకంగా శిక్షణిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంకుడు గుంతలు, మరుగు దొడ్ల నిర్మాణాలపై వివరించారు. ఆరుబయట మల విసర్జన చేయవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సరస్వతి, సర్పంచ్ వనిత, ఉప సర్పంచ్ గంగారెడ్డి, ఎంపీవో సాయిలు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ హఠాన్మరణం

బోధన్‌రూరల్(బోధన్): బోధన్‌కు చెందిన రైస్‌మిల్ యాజమాని, ఏఎంసీ డైరెక్టర్ ఫసీయోద్దిన్ (41) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో స్థానిక ఎమ్మెల్యే షకీల్, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విఠలేశ్వర ఆలయ పునఃప్రారంభోత్సవాలు

రుద్రూర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయ పునఃప్రారంభ మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలతో ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర అనంతరం ఆలయంలో యాగశాల ప్రారంభించి యజ్ఞం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా కల్యాణోత్సవం

బాల్కొండ: వన్నెల్(బి)లో వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం రథోత్సవాన్ని చేపట్టారు. ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్ టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జెంటిల్ కిడ్ పాఠశాలలో, లోటస్ స్మార్ట్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తాము రూపొందించిన విజ్ఞాన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



ఆర్టీసీ సేవల గురించి వివరిస్తున్న డీఎం స్వామి

రుద్రూర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ టీఎస్ స్వామి కోరారు. పొతంగల్ మండలం దోమలేడ్గి, కొల్లూర్, సుంకిని గ్రామాల్లో బుధవారం బోధన్ డిపో ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రజా ప్రయోజనం కోసమే బస్సులను నడుపుతోందని అన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు బస్ పాస్ రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 24 గంటలు కార్గో సేవలు అందించడంతో పాటు, డిపాజిట్ లేకుండా శుభకార్యాలకు బస్సులను అద్దెకు ఇస్తున్నామని వివరించారు.

పెరిగిన కరువు భత్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత మల్లేశ్

రుద్రూర్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం వచ్చే నెల 1 నుంచి ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. చందూర్ మండల కేంద్రంలో బుధవారం బీడీ కార్మికులతో కలిసి మాట్లాడారు. బీడీ కార్మికులందరిని యూనియన్ సంఘటిత పరిచి పోరాడిన ఫలితంగానే 1994లో కరువు భత్యం సాధించుకున్నామని పేర్కొన్నారు. పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమాచారం..

■ నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలరాజు బుధవారం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో 33 కేవీ విద్యుత్ లైన్ ఏబీ స్విచ్ బిగింపు పనులు చేపడతున్నందు వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

■ బోధన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బగోని గంగాధర్ గౌడ్‌లు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, టీపీసీసీ నేత సుదర్శన్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు.

సంక్షిప్తం

సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి
కమ్మర్‌పల్లి: మెడికో విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని హాసాకొత్తూర్ బంజారా సేవా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

సర్వ సమాజ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం
ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ ప్రజా ఐక్య సమితి సర్వసమాజ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. సర్వ సమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు 16 కులాలకు సంబంధించిన సభ్యులతో ఏర్పడిన నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా గూపాల భూపేందర్, కోశాధికారిగా లింగంపల్లి శివ, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

సాయన్న సేవలు మరువలేనివి
మాక్లూర్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే గైని చిన్న సాయన్న గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని ప్రముఖ న్యాయవాది, నిజామాబాద్ మాజీ మార్కెట్ కమిటీ ఐర్మన్ ఆజార్ కిషన్‌రావు అన్నారు. సాయన్న స్వగ్రామం వల్లభాపూర్‌లో బుధవారం ఆయన సంతాపసభకు ఆజార్ కిషన్‌రావు హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా సాయన్న చేసిన సేవలు కొనియాడారు.

శివాజీ విగ్రహానికి రూ.లక్ష విరాళం
ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో శివాజీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు కందగట్ల రామచందర్, సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, గంగాధర్ తదితరలు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
బోధన్‌టౌన్(బోధన్): న్యాక్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల కుటుంబ సభ్యులు, యువతులకు ఇస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏడీ ప్రభాకర్ అన్నారు. రాకాసీపేట్‌లోని లేబర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణలో భాగంగా టైలర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడారు. శిక్షణతో పాటు కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. న్యాక్ సిబ్బంది మమత, కృష్ణ, సాగర్‌లు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు
రుద్రూర్: ఏకాగ్రతపై దృష్టి సారిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. కోటగిరి వివేకానంద హైస్కూల్‌లో బుధవారం రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రామకృష్ణ మిషన్ 125వ వార్షిక మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ అధికారి రఘురాజ్, మండల విద్యాధికారి నాగనాథ్, స్థానిక సర్పంచ్ పత్తి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన
ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో బుధవారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహారాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శిఖర ప్రతిష్ఠాపన, విగ్రహాల ఊరేగింపు చేశారు. జెడ్పీవైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, సర్పంచ్ మాధవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె ప్రారంభం



బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సీఐటీయూ నేతలు



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట..

బోధన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జంబిశెట్టి శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచ ర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ బుధవారం నుంచి ఈ నెల 3 వరకు సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మెలో భాగంగా బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తరలి వచ్చి ధర్నా చేపట్టారు. ఆర్డీవో ఆఫీసు ఏవో ముంతాజుద్దీన్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని విమర్శించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
ఆర్మూర్‌టౌన్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, అంగన్‌వాడీ యూనియన్ ఆర్మూర్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు చంద్రకలు అన్నారు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలి
భీమ్‌గల్: అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని సీఐటీయూ నేత దేవగంగు అన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఇంచార్జ్ సీడీపీవో స్వర్ణలతకు వినతి పత్రం అందజేశారు.

జీవాల సంపదను పెంచుకోండి



శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి

మాక్లూర్: వైద్య శిబిరాల్లో జీవాలకు నట్టల నివారణ మందు వేయించుకుని మందలను పెంచుకోవాలని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి గొర్రె, మేకల పెంపకందారులకు సూచించారు. బుధవారం ఒడ్డెట్‌పల్లిలో కొనసాగుతున్న జీవాల ఉచిత నట్టల నివారణ శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలన్నారు. జీవాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మందలు విస్తరిస్తాయన్నారు. అనంతరం మదన్‌పల్లి, ముత్యంపల్లి గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందు వేశారు. పశువైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, సహేర్, కుర్మసంఘం నాయకులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతలు 'జిల్లా'పై స్పందించాలి

- 73వ రోజుకు చేరిన దీక్షలు



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావాలని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను అధికార పక్ష నేతలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని న్యాయవాదులు అన్నారు. తాము రిలే నిరాహార దీక్షలు చేపట్టి రెండున్నర నెలలు పూర్తికావస్తున్నా అధికార పక్ష ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 73వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు, రమేష్‌లు కూర్చున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మోడల్ స్కూల్లో మాట్లాడుతున్న ఎస్సై అనిల్‌రెడ్డి

రుద్రూర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎస్సై అనిల్ రెడ్డి సూచించారు. రుద్రూర్ మండలం అంబం(ఆర్) శివారులోని మోడల్ స్కూల్‌లో బుధవారం వర్ని పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్‌లో ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు చెప్పే మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరిద్దాం
బోధన్‌టౌన్(బోధన్): సమాజంలో నిత్యం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరిద్దామని పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ అన్నారు. పట్టణంలోని విస్డమ్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో భాగంగా సైబర్ జాగృత దివస్‌ను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీవ్ర కసరత్తు జరుగుతుందని అన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల నిరసన



బోధన్‌లో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు



ఆర్మూర్‌లో..

బోధన్‌రూరల్(బోధన్): విద్యుత్ శాఖలో నెలకొన్న సమస్యలు, నూతన వేతనాల జాప్యాన్ని నిరసిస్తూ విద్యుత్ శాఖ అధికారులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం బోధన్ పట్టణ శివారులోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం(బెల్లాల్)లో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని విద్యుత్ శాఖ అధికారులు నల్ల బాడ్జీలతో నిరసన తెలియజేసి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ జేఏసీ చైర్మన్ శివ ప్రసాద్ మాట్లాడుతూ.. యాజమాన్యం వెంటనే నూతన పీఆర్సీ అమలు ప్రకటించాలన్నారు. ఏఈలు కల్యాణ్, రాజశేఖర్ రెడ్డి, కృష్ణ, ఆనంద్, ఏడీఈ బెనర్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో..
ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్మూర్ జేఏసీ చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. సమస్యలపై యాజమాన్యం స్పందించక పోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏడీఈ శ్రీధర్, సిబ్బంది నర్సయ్య, సంజీవ్, పోశెట్టి, గంగాధర్, హరీష్, షకీల్, రాంచందర్ పాల్గొన్నారు.